క్లుప్తంగా

అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

చిల్లకల్లు/వత్సవాయి(జగ్గయ్యపేట): ఐసీడీఎస్ చిల్లకల్లు ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న నాలుగు సహాయకుల పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో లక్ష్మీభార్గవి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వత్సవాయి మండలం సింగవరం-2లో ఓసీ జనరల్, జగ్గయ్యపేట మండలం పోచంపల్లి-1 ఓసీ, పోచంపల్లి-3 ఎస్సీ, వేదాద్రి-3లో బీసీ (బి) కేటాయించారని తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 21 నుంచి 35 ఏళ్ల వయసు ఉండి, 10వ తరగతి ఉత్తీర్ణులైన స్థానికులు, వివాహిత మహిళలు అర్హులని 31వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఐసీడీఎస్ కార్యాలయంలో అందించాలని వివరించారు.

రేపు కానుకల లెక్కింపు

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలోని యోగానంద లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను ఈ నెల 27వ తేదీ లెక్కిస్తారని ఆలయ ఈవో నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో జరిగే లెక్కింపులో ఆసక్తి ఉన్న భక్తులు పాల్గొనాలని కోరారు.

అన్నదాన పథకానికి విరాళం



పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి శనివారం విజయవాడ పోరంకికి చెందిన వేమన చంద్రశేఖరరావు, రాధిక దంపతులు రూ.10,011 విరాళాన్ని ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణప్రసాద్‌కు అందజేశారు. ఆలయ అధికారులు దాతలకుఅమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

రెవెన్యూ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ



పెనుగంచిప్రోలు: రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ డైరీని శనివారం గ్రామంలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీటీ రవి, ఆర్ఐ జనార్ధనరావు, వీఆర్వోలు చైతన్య, బేబి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు వేల్పుల రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

29న వాహనాల వేలం

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ అధికారులు ఈనెల 29 న తమ స్టేషన్ పరిధిలో వివిధ ప్రొహిబిషన్, ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 17 వాహనాలకు వేలం పాటలు నిర్వహించనున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ జి.శ్రీనివాసరావు శనివారం ఒకప్రకటనలో తెలిపారు. వాటిలో 15 ద్విచక్ర వాహనాలు, ఒక టాటా ఏస్ వాహనం, ఒక ఆటో ఉన్నాయని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనాలనుకునేవారు టాటా ఏస్ వాహనం, ఆటోలకు రూ 5 వేలు, ద్విచక్ర వాహనాలకు రూ 3 వేల చొప్పున దరావత్తు చెల్లించాలని, వివరాలకు 94409 02461, 95022 58678 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

రేపు గండేపల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం

గండేపల్లి(కంచికచర్ల): మండలంలోని గండేపల్లి ఎస్‌డీఏ చర్చి ఆవరణలో ఈ నెల 27న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బొక్కా వీరయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి సమస్యలు, పొరలు, శుక్లాలు, నీటి కాసులు, మసకగా కనపడుతున్నవారికి వైద్యులు ఉచితంగా పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి నూజివీడులో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తారని వివరించారు. వీటిని వినియోగించుకోవాలని కోరారు.

తిరుపతమ్మను దర్శించుకున్న ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్



పెనుగంచిప్రోలు: గ్రామంలోని శ్రీతిరుపతమ్మను శనివారం ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు ఆమెకు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, ఏఈఓ కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై రాజీ లేదు

కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: పారిశుద్ధ్య విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. శనివారం మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో చైర్మన్ రాఘవేంద్ర అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ అత్యవసర సమావేశంలో పలువురు సభ్యులు పారిశుద్ధ్యం మీద ఏకరువుపెట్టారు. గత కౌన్సిల్‌లో ప్రతిపక్ష సభ్యులు 13 మందిపై సస్పెన్షన్ వేటు పడటంతో వారెవరూ సభకు రాకపోవడంతో, ఆ రోజు సభకు రాని ఒకే ఒక ప్రతిపక్ష సభ్యురాలు గెల్లా సంధ్యారాణి హాజరయ్యారు. చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలో అన్ని వార్డుల్లో శానిటేషన్ విషయంలో కౌన్సిలర్లు ఎవరూ సంతోషంగా లేరన్నారు. పశువులు రోడ్లపై సంచరించడం, కుక్కల సమస్య పరిష్కారానికి కమిషనర్ చర్యలు తీసుకోవాలని, వీటిపై దృష్టి సారించి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు పోవాలని అధికారులకు సూచించారు.

● ముందుగా మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ లేచి మాట్లాడుతూ ఇంతమంది సిబ్బంది ఉండి, లక్షలాది రూపాయలు ఖర్చుపెడుతున్నా ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. చైర్మన్ మాట్లాడుతూ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి ఫిర్యాదులు రాకుండా చూడాలని ఆదేశించారు.

అధికారుల నిర్లక్ష్యంతో మున్సిపాలిటీకి తీవ్ర నష్టం

ఎజెండాలోని 8వ అంశానికి సంబంధించి మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ మాట్లాడుతూ కోదాడ రోడ్డులో పట్టణ నడిబొడ్డున ఉన్న ఇందు హోటల్ కాంప్లెక్స్‌లో అనేక షాపులు అద్దెకు ఇస్తూ నెల నెలా లక్షలాది రూపాయల ఆదాయం గడిస్తున్నారని తెలిపారు. దాని యజమాని మోటమర్రి రామకృష్ణ 2019 నుంచి ఆస్తిపన్ను చెల్లించడం



మాట్లాడుతున్న జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

లేదని పన్ను తగ్గించాలని రివిజన్ పిటిషన్ దాఖలు చేయడం దారుణమన్నారు. సుమారు రూ 11 లక్షల మేర బకాయిలు పేరుకుపోయినా రెవెన్యూ అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహించారని ప్రశ్నించారు. వడ్డీ మాఫీ కింద రూ 2 లక్షల మేర తీసివేయాల్సి రావడంతో మున్సిపాలిటీ ఆదాయాన్ని కోల్పోయినట్లు అయిందన్నారు. ముందుగానే కోర్టు ద్వారా నోటీసులు జారీ చేసి ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదన్నారు. పాలకవర్గ సభ్యుడు వట్టెం మనోహర్ మాట్లాడుతూ సమయం, ఖర్చు వృధా కావడం అధికారుల తప్పిదమేనని ఇలాంటి పరిస్థితి రాకుండా చూడాలని హెచ్చరించారు.

ఆ ఉద్యోగి నుంచి రికవరీ ఏదీ..

పన్నులు కట్టించుకోవడంలో 14 మంది నుంచి రూ 5 లక్షల మేర వసూలు చేసి డూప్లికేటు బిల్లులు ఇచ్చి అవినీతికి పాల్పడిన అనిల్ అనే మున్సిపల్ ఉద్యోగిపై మెతక వైఖరి ఎందుకు అవలంబిస్తున్నారని 30 వ వార్డు కౌన్సిలర్ పందుల రోశయ్య ప్రశ్నించారు. దీనిపై ఆర్వోను వివరణ ఇవ్వాల్సిందిగా చైర్మన్ కోరారు. ఆర్వో రత్నావళి మాట్లాడుతూ ఇది మున్సిపాలిటీకి సంబంధం లేదపి బయట జరిగిందన్నారు. దీనిపై ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదని కమిషనర్‌ను ప్రశ్నించారు. 5 వ వార్డు కౌన్సిలర్ వట్టెం మనోహర్



హాజరైన కౌన్సిల్ సభ్యులు

మాట్లాడుతూ కమిషనర్ ఉదారంగా వ్యవహరించడంతో మున్సిపాలిటీ నష్టపోవాల్సి వస్తుందన్నారు. కమిషనర్ శివకోటేశ్వరరావు వివరణ ఇస్తూ 15 రోజుల్లో చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై చైర్మన్ మాట్లాడుతూ 15 రోజుల్లో రికవరీ చేయకుంటే పోలీస్ కంప్లెయింట్ ఇవ్వాలని ఆదేశించారు.

పలువురు సభ్యులు.. సమస్యల ప్రస్తావన

మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ హఫీజున్నీసా, పాలకవర్గ సభ్యులు సుందరమ్మ, కాశి అనురాధ పారిశుద్ధ్యంపై మాట్లాడారు. కాలువల్లో వారానికి ఒక రోజు కూడా చెత్త, వ్యర్థాలు తొలగించడం లేదని తెలిపారు. కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాబు మాట్లాడుతూ ఇటీవల వర్షాలకు తొర్రగుంటపాలెం మదీనా మసీదులోకి నీరు ప్రవహించిందని, సమీపంలో డ్రెయిన్ నిర్మాణం సరిగా లేక ఇలా జరిగిందని, సమస్యను పరిష్కరించాలని కోరారు. శాంతినగర్‌లోని మద్యం దుకాణం రోడ్డు పక్కనే ఉందని తాగుబోతులు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, దానికి వేరే చోటికి మార్చాలని సభ్యులు గింజుపల్లి వెంకట్రావు, నూకల సాంబ చైర్మన్‌కు తెలిపారు. అనంతరం ఏజెండాలోని 8 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. వైస్ చైర్మన్ హఫీజున్నీసా, కమిషనర్ శివకోటేశ్వరరావు, అందరు కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: మహిళల ఆర్థికాభివృద్ధే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. జగనన్న మహిళా చేయూత మార్ట్‌లకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మెప్మా, మున్సిపల్ అధికారులతో శనివారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ నియోజకవర్గానికి జగనన్న మహిళా మార్ట్ స్టోర్‌లు రెండు మంజూరయ్యాయని చెప్పారు. మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకుని నందిగామలో మెప్మా ఆధ్వర్యంలో మహిళా చేయూత మార్ట్ స్టోర్ నిర్వహించాలని సూచించారు. డ్వాక్రా సంఘాల్లో



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

మహిళలకు తక్కువ ధరకు నాణ్యమైన సరుకులు అందించడానికే మహిళా మార్ట్ స్టోర్‌లను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జయరాం, ఏపీఎం రమణ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

కచ్చితమైతన కొలతలు, హద్దులతో రీ సర్వే

కంచికచర్ల: కచ్చితమైన కొలుతలు, హద్దులతో భూములను రీ సర్వే చేసి సర్వే హద్దు రాళ్లను పాతుతున్నామని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి అన్నారు. పరిటాలలో శనివారం జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు భూములను రీ సర్వే చేసి రైతులకు పట్టాలు పంపిణీ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు భూ హక్కు పత్రంతో హాజరుకావాలని కోరారు. సర్వే హద్దు రాళ్లను పాతేటప్పుడు తమ సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో డీటీ నాగుల్‌మీరా, ఆర్ఐ శిరీష, సర్వేయర్ బసవరావు, వీఆర్వోలు వేముల ప్రదక్షిణరావు, వేల్పుల జనార్ధన్, రైతులు పాల్గొన్నారు.

వీరులపాడు: రైతుల భూ సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం జగనన్న భూహక్కు-భూ రక్ష పథకాన్ని ఏర్పాటు చేసిందని అసిస్టెంట్ డైరెక్టర్ సూర్యారావు పేర్కొన్నారు. వీరులపాడులోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యా



పరిటాలలో సరిహద్దు రాళ్లను పాతిస్తున్న తహసీల్దార్ రాజకుమారి

లయ భవనంలో.. మండలంలో జరుగుతున్న భూముల రీ సర్వేపై అధికారులతో శనివారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక పద్ధతులతో భూముల రీ సర్వే జరుగుతుందన్నారు. సమావేశంలో ఆర్డీవో రవీంద్ర, తహసీల్దార్ ఆశయ్య నాయక్, డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ శివప్రసాద్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

గడప గడపలో సంక్షేమం

నందిగామ టౌన్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో గడప గడపలో సంతోషం నింపుతున్నారని నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలో శనివారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రతి గడపలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అందజేశారు. జగన్‌మోహనరావు మాట్లాడుతూ అందరికీ పథకాలు అందజేస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మంచి చేస్తున్నామని ప్రజలు అండగా నిలిచి ఆశీర్వదించాలని జగన్‌మోహనరావు కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నల్లాని రమాదేవి, పీఏసీఎస్ చైర్మన్ నల్లాని అయ్యన్న, పార్టీ మండల



ముప్పాళ్లలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, నాయకులు యార్లగడ్డ సత్యనారాయణ ప్రసాద్, బండారుపల్లి కపిల్ తదితరులు పాల్గొన్నారు.

జలకళ ద్వారా బోర్లు



వత్సవాయి: వైఎస్సార్ జలకళ ద్వారా వత్సవాయిలో శనివారం బోర్లను వేశారు. మొత్తం గ్రామంలో 14 మంది రైతులకు జలకళ ద్వారా ప్రభుత్వం నుంచి బోర్లు మంజూరయ్యాయి. కొలుసు తిరుపతిరావుకు చెందిన పొలంలో బోరును సర్పంచ్ భూక్యా సీతమ్మ, జెడ్పీటీసీ యేశపోగు దేవమణిలు ప్రారంభించారు. ఏపీఓ రాఘవులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం ప్రత్యేకంగా జలకళ పథకాన్ని రూపొందించి ఈ పథకం ద్వారా బోర్లు వేయిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొలికపోగు వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ చింతలు ఏడుకొండలు, భూక్యా రాజానాయక్, యేశుపోగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

జగ్గయ్యపేట అర్బన్: కార్మిక చట్టాల పరిరక్షణకు ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సీహెచ్.శ్రీనివాస్ అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్మికులు, ముఠా కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, కృషి విజ్ఞాన కేంద్రం కాంట్రాక్టు కార్మికుల సామూహిక సమావేశాలు నిర్వహించారు. చలో ఢిల్లీ గోడపత్రికను ఆవిష్కరించారు. సీఐటీయూ మండల కార్యదర్శి గౌస్‌మియా, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ప్రణయ్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

బబ్బెళ్లపాటికి ప్రతిభా పురస్కారం

నందిగామ: సుదీర్ఘ కాలంగా కళామ తల్లి సేవ చేస్తున్న బళ్లారి రాఘవ కళా సమితి వ్యవస్థాపకుడు బబ్బెళ్లపాటి గోపాలకృష్ణ సాయికి మరో గౌరవం దక్కనుంది.ఉభయ తెలుగు రాష్ట్రాలలో పలు రంగాల్లో నిస్వార్థ సేవలు అందిస్తున్న పలువురికి ఈనెల 31 న హైదరాబాదులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నారు. ఆరోజు మధ్యాహ్నం ఎన్టీఆర్ కళామందిరంలో మొత్తం 12 మందికి పురస్కారాలు అందజేయన్నారని వారిలో నాటక రంగం తరపున తనను ఎంపిక చేసినట్లు బబ్బెళ్లపాటి గోపాలకృష్ణ సాయి శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి ఆహ్వాన పత్రం వచ్చిందన్నారు.

ఉన్నతస్థాయికి చేరుకోవాలి

నందిగామ టౌన్: విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ డే కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. జగన్‌మోహనరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేలా విద్యార్థులు ముందుకు సాగాలని తెలిపారు. పది ఫలితాల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాంబాబు నాయక్, నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వైఎస్ఎస్ ప్రసాద్, పలువురు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విధుల్లో ‘జగ్గయ్యపేట’ నూతన కమిషనర్

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పురపాలక సంఘం నూతన కమిషనర్‌గా చందవోలు మల్లేశ్వరరావు శనివారం విధుల్లోకి చేరారు. చీరాల పురపాలక సంఘం నుంచి బదిలీపై వచ్చిన ఆయన ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న శివకోటేశ్వరరావు నుంచి చార్జి తీసుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నులపై ప్రభుత్వం ఇచ్చిన వడ్డీ మాఫీని వినియోగించుకొని ఈనెల 31 వ తేదీ లోపు సకాలంలో పన్నులు చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నాగకుమారి, ఏఈ హనుమంతరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, ఆర్వో రత్నాంజలి, టీపీఎస్ మల్లేశ్వరరావు, టౌన్ సర్వేయర్ విశ్వనాథం, సీనియర్ అసిస్టెంట్ తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



నూతన కమిషనర్‌ను అభినందిస్తున్న ఇన్‌చార్జ్ కమిషనర్ శివకోటేశ్వరరావు, మున్సిపల్ సిబ్బంది

‘పది’లో అత్యధిక మార్కులు సాధించాలి

జగ్గయ్యపేట అర్బన్: పదో తరగతిలో విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించాలని జేఆర్‌సీ విద్యాసంస్థల కరస్పాండెంట్, సెక్రటరీ పెనుగొండ రాజీవ్, చైర్మన్ రంగాపురం నరసింహారావు అన్నారు. గత నెల 20న ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో 10 వ తరగతి మోడల్ పరీక్షను విద్యార్థులకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఈ పరీక్షలో అధిక మార్కులు సాధించిన విద్యార్థుల్లో పాఠశాలలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారికి శనివారం జేఆర్‌సీ జూనియర్ కళాశాలలో బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమేశ్వరరావు, జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎస్‌సీహెచ్.శ్రీనివాసరావు, పేట మండల



ప్రతిభ కనపరచిన విద్యార్థులతో ఎస్ఎఫ్ఐ నాయకులు, ‘జేఆర్సీ’ నిర్వాహకులు

అధ్యక్ష, కార్యదర్శులు రాజు, ఎస్.ప్రణయ్‌తేజ, ఐద్వా మహిళా సంఘం డివిజన్ కార్యదర్శి ఎస్.నాగమణి, కళాశాల ప్రిన్సిపాల్ అబ్బులు, వైస్ ప్రిన్సిపాల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు సీఎం జగన్ భరోసా

వీరులపాడు: డ్వాక్రా మహిళలను ఆదుకున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీపీ కోటేరు లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామ సచివాలయంలో మూడవ విడత వైఎస్సార్ ఆసరా పథకం విడుదల సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి డ్వాక్రా మహిళలతో కలిసి శనివారం ఆమె పాలాభిషేకం చేశారు. ఆమె మాట్లాడుతూ చంద్రబాబు రుణమాఫీతో డ్వాక్రా సంఘాలు నిర్వీర్యమయ్యాయన్నారు. ఆ తర్వాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంఘ సభ్యుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారని తెలిపారు. వరుసగా మూడో సారి కూడా సంఘ సభ్యులకు ఆసరా నగదు అందించటం అభినందనీయమని చెప్పారు. జయంతి గ్రామంలో పీఏసీఎస్ చైర్మన్ జంగా కోటిరెడ్డి ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎంపీపీ, మహిళలు

సర్పంచ్ బందెల రాణి, వైస్ ఎంపీపీ వేమూరి ఆదాం, మాజీ సర్పంచ్ కోటేరు సూర్యనారాయణ రెడ్డి, ఉప సర్పంచ్ బెల్లంకొండ నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు మోండ్రు బాయమ్మ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

నందిగామ: వేసవిలో పట్టణ వాసులకు మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణంలోని 7వ వార్డులో వైస్ చైర్ పర్సన్ మాడుగుల నాగరత్నం తో కలిసి శనివారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు, స్థానిక బోరు పంపులలోని నీటి నాణ్యతను పరిశీలించారు. వార్డు ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణ పరిధిలోని అన్ని బోరు పంపులకు మరమ్మతులు చేయిస్తున్నామన్నారు.



నీటి నాణ్యతను పరిశీలిస్తున్న కమిషనర్ జయరాం

ఆయన వెంట సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

‘మధ్యాహ్న భోజనం’లో సమూల మార్పులు

వీరులపాడు: మధ్యాహ్న భోజన పథకంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టి జగనన్న గోరుముద్ద ద్వారా రుచికరమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎంపీపీ కోటేరు లక్ష్మి అన్నారు. పోషక అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి శనివారం ఆమె 2కె రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో రక్తహీనత లోపాన్ని నివారించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మధ్యాహ్న భోజన పథక ఏజెన్సీ నిర్వాహకులు ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో లక్ష్మీభార్గవి, సర్పంచ్ బందెల రాణి, వైస్ ఎంపీపీ వేమూరి ఆదాం, మాజీ సర్పంచ్ కోటేరు సూర్యనారాయణ రెడ్డి, పలువురు నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పోషణ అభియాన్‌లో విద్యార్థులు

ఆకట్టుకున్న హరికథా గానం

విజయవాడకల్చరల్: ఆదిభట్ల నారాయణదాసు, వారి శిష్యుడు నేతి లక్ష్మీనారాయణ సంస్మరణార్థం దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో శనివారం తాడేపల్లిగూడేనికి చెందిన కే శారద నారాయణదాసు రచించిన సీతా కల్యాణం కథా గానం మధురంగా సాగింది. దశమహారాజుకు సంతానం లేక పోవడం, రుషుల సూచనతో యాగం చేయడం, యాగ పురుషుడు అందించిన పాయసంతో దశరథునకు నలుగురు పుత్ర సంతానం కలగడం, రాముడు విల్లును విరిచి సీతాదేవిని పరిణయం చేసుకోవడం అంశంగా కథా గానం సాగుతుంది. పాణ్యం దక్షిణామూర్తి, కాకవరపు సుబ్బారావు వాద్యసహకారం అందించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన కార్యక్రమ నిర్వాహకుడు బుర్రా పద్మనాభశాస్త్రి మాట్లాడుతూ ఆదిభట్ల నారాయణదాసు హరికథకు జీవం పోశారన్నారు. త్యాగరాజ స్వామి సాంస్కృతిక సంఘం కార్యదర్శి నేతి విశ్వేశ్వరరావు, హైదరాబాద్ అన్నమయ్య పరివారం నిర్వాహకులు వెంకట కృష్ణయ్య నారాయణదాసు సేవలను వివరించారు.

పాడిపరిశ్రమలో ఆధునిక పద్ధతులు

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): పాడిపరిశ్రమల్లో ఆధునిక పద్ధతులు పాటించి అధిక ఆదాయం పొందాలని నందిగామ పశుసంవర్ధక శాఖ ఏడీ వెంకటేశ్వర రావు అన్నారు. సంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో కొటికలపూడిలో శనివారం నిర్వహించిన లేగదూడల ప్రదర్శన ఆకట్టుకుంది. వివిధ వయస్సుల లేగదూడలను ప్రదర్శనలో ఉంచారు. ప్రదర్శనలో ఆకట్టుకున్న లేగదూడల యజమానులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పశుగణాభివృద్ధి ఈఓ శ్రీనివాసులు, ఏడీ రాధాకృష్ణమూర్తి, సర్పంచ్ రెంటపల్లి నాగరాజు, బండి వెంకటరావు, దుర్గారావు, పశువైద్యులు హరిత, శైలుమాధురి, మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు విద్యార్థుల ఎంపిక

పాయకాపురం(విజయవాడరూరల్): ఎల్‌బీఎస్ నగర్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య నగరపాలక సంస్థ హైస్కూల్ విద్యార్థులు ఉపకార వేతనాలు పొందుటకు అర్హత సాధించారని హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత సాధించిన విద్యార్థులను శనివారం అభినందించారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ.. 28 మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌లో ఉపకార వేతనాలకు పరీక్షలు రాయగా ఐదుగురు విద్యార్థులు అర్హత సాధించారన్నారు. నాలుగేళ్ల పాటు ఏడాదికి 12 వేల రూపాయల చొప్పున ఉపకార వేతనం అందిస్తారని చెప్పారు. జిల్లా సైన్స్ ఉపాధ్యాయుడు హుస్సేన్, ఉపాధ్యాయులు రాధిక, అనురాధ, విజయలక్ష్మి, నళిని, శేఖర్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మిద్దాం



కనిమెర్ల తండా(మైలవరం): ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని, పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. మైలవరం మండలంలో లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల దత్తత గ్రామం కనిమెర్ల తండాలో స్పెషల్ క్యాంప్‌ను శనివారం ప్రారంభించారు. కనిమెర్ల తండా ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ ఒక మొక్కను నాటాలన్నారు. ప్లాస్టిక్ బ్యాగ్‌లు నిషేధించి, పేపర్ బ్యాగ్‌లు వాడాలన్నారు. పాఠశాల హెచ్ఎం సతీష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ బి.శివ హరిప్రసాద్ మాట్లాడుతూ మొక్కల నుంచి ఔషధాల తయారీ జరుగుతుందని, ఆక్సిజన్ లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వలంటీర్లు ఇంటింటికీ తిరిగి పేపర్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు.